APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 09 సెప్టెంబర్ 2026 సంపుటి: 01 సంచిక :105 పేజీలు : 04 వెల: 2-00/-



## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..

- ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలైన వైనం
- దట్టమైన బూడిద కారణంగా 8 విమానాశ్రయాలు మూసివేత, 2300 ఫ్లైట్లు రద్దు
- విమానాశ్రయాల్లో చిక్కుకున్న సుమారు 2.70 లక్షల మంది ప్రయాణికులు
- సునామీ ప్రమాదం లేదన్న అధికారులు, లెవెల్-3 హెచ్చరికలు జారీ

## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్



- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

### రైల్వే మంత్రి కీలక ప్రకటన

- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

## నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి



- దసరా మరుసటి రోజే కొత్త పార్టీ ప్రకటిస్తానన్న మాజీ ఎంపీ
- టీడీపీ, వైసీపీ కుటుంబ పార్టీలంటూ విజయసాయిరెడ్డి విమర్శ
- నమ్మకద్రోహి అంటే నిజాలు బయటపెడతానంటూ వైసీపీకి హెచ్చరిక
- బొత్స, సత్యకుమార్ ఆరోపణలను తిప్పికొట్టిన సాయిరెడ్డి

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

# పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

## ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం

- ★ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ★ ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ★ ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- ★ 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- ★ టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, మిగతా 2 లో



## నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా: సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

మహిళల గౌరవంపై విజయ్ తీసుకున్న నిర్ణయాలు సంతోషాన్ని ఇచ్చాయన్న చంద్రశేఖర్

ప్రత్యర్థి పార్టీల చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని వ్యాఖ్య

ప్రతిపక్షాల విమర్శలను విజయ్ తిప్పికొట్టిన తీరు సంతోషాన్ని ఇచ్చిందని వెల్లడి

# ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

## సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు?

- సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం
- ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం



అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ మిగతా 2 లో

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

### కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం

- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న మిగతా 2 లో

## తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి


# ఆయనతో రాజీనామా చేయించాలి

## శాసనసభకు, స్పీకర్ స్థానానికి, రాష్ట్ర ప్రజలకు అవమానం

- ఎమ్మెల్సీ తాతా మధుతో కేసీఆర్ రాజీనామా చేయించి, క్షమాపణ చెప్పాలి
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్
- ఎమ్మెల్సీ వ్యాఖ్యలను ఖండించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, భాజపా, మజ్లిస్, సీపీఐ సభ్యులు
- మండలి నుంచి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలు సస్పెన్షన్



హైదరాబాద్: రెండో రోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. (మంగళవారం, సెప్టెంబర్ 8వ తేదీ) సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష బీఆర్ఎస్- ప్రభుత్వ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రధానంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ అంశంపై సభ హోరెత్తిపోయింది. దీనిలో భాగంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలకు సభలో తీర్మానం పెట్టారు. మిగతా 2 లో



## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్



- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

### ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని

# సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

### వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

# రైల్వే మంత్రి కీలక ప్రకటన

ఢిల్లీ: భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

### 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

### నా వడోదరా అద్భుతం..

# ప్రధాని మోదీ భావోద్వేగం

ఢిల్లీ: గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..



ఢిల్లీ: ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి




అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.


# తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి ఆయనతో రాజీనామా చేయించాలి

మొదటి పేజి తరువాయి

ఇందుకు సభలో ఆమోదం లభించింది.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ మండిపడింది. ఆయన మాటలు సభాపతి స్థానానికే కాక.. మొత్తం అసెంబ్లీకి, నాలుగు కోట్ల మంది ప్రజలకు అవమానకరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణకు చీకటి రోజని వెల్లడించారు. స్పీకర్ మాతృమూర్తిని అవమానించడం బాధాకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టారు. అధికారపక్షానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు భాజపా, ఎంఐఎం, సీపీఐ సభ్యులు సైతం భారాస ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు దుర్భాషలాడారని తెలుసుకొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఈ అంశంపై శాసనసభలో ప్రత్యేకంగా చర్చించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్కలు మాట్లాడుతూ.. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయడంతోపాటు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. భారాస దళిత వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. భాజపా, మజ్లిస్ నేతలు సైతం తాతా మధుతో రాజీనామా చేయించాలని కోరారు.

ఇది క్షమించరాని నేరం: సీఎం



స్వతంత్ర భారతంలో ఒక సభాపతికి ఇలాంటి అవమానం ఎప్పుడూ జరగలేదని, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'ఇలాంటి వ్యాఖ్యలను క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండవు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది. సభలో ముఖ్యమంత్రైనా, శాసనసభ్యుడైనా స్పీకర్‌కు ఒకటే. అలాంటి వ్యక్తి మనసు గాయపడేలా భారాస వ్యవహరించింది. ఈ ఘటన గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరికే సంబంధించినది కాదు. మొత్తం సభ్య సమాజానికే జరిగిన అవమానంగా భావించాలి. స్పీకర్ పదవి ఒక అత్యున్నత స్థానం. సభాపతిని గౌరవించడం మన సంప్రదాయం. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా సభ్య సమాజం తలదించుకునేలా కొంతమంది మాట్లాడారు. నేను జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అన్ని సభలనూ చూశాను. కానీ, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై పథకం ప్రకారమే ఉసిగొల్పారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని, మూడెకరాల చొప్పున ఇస్తానని, దళితబంధు ఇస్తామని నమ్మించి.. దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారు. నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి, ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారు. భారాసది దళిత వ్యతిరేక ఆలోచన, వైఖర్లను అందరం ముక్తకంఠంతో ఖండించాలి. ప్రభుత్వం సంయమనం పాటిస్తుంటే చేతకానితనంగా భావిస్తున్నారు. అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకోం. తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి, ఆయనతో రాజీనామా చేయించాలని సభా నాయకుడిగా నేను డిమాండ్ చేస్తున్నా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చర్చ సమయంలో భాజపా నేతలు 22ఏపై చర్చించాలని పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. చర్చకు ఇంతకంటే ప్రాధాన్యమున్న అంశం ఏముంటుందని ప్రశ్నించారు. భారాస వేసిన అపవాదు, దుర్మార్గాలను భాజపా ఎందుకు కాపాడుతోందని నిలదీశారు. భారాస ఎమ్మెల్సీ తాతా మధును భాజపా సమర్థిస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని సూచించారు.

# నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా


### సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల వేళ విజయ్ తండ్రి, సీనియర్ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన పలు రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన ఆయన... తన కొడుకుని చూసి తాను ఎంతో గర్వపడుతున్నాను అంటూ కుమారుడికి పూర్తి మద్దతుగా సంచలన ప్రకటన చేశారు. గతంలో విజయ్‌తో ఉన్న విభేదాలు, వ్యక్తిగత వివాదాల వల్ల దూరంగా ఉంటున్నారనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన విజయ్ వైఖరిని గట్టిగా సమర్థించారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదలపై సభలో విజయ్ తీసుకున్న స్పష్టమైన నిర్ణయాలు, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టిన తీరు పట్ల ఒక తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని, కొడుకు విజయాన్ని, పట్టుదలను చూసి గర్విస్తున్నానని ఎస్.ఏ. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. తండ్రి నుంచి వచ్చిన ఈ బహిరంగ మద్దతుతో టీవీకే వర్గాలు, విజయ్ అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నిండింది.

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

హైదరాబాద్: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే



ఢిల్లీ: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు.

తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి

అమరావతి: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు. తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు. తన కొత్త పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తాను ఉండబోనని, సమర్థులైన వ్యక్తినే ఆ స్థానంలో నిలబెడతామని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆసక్తితో 'రెడ్డి' సామాజిక వర్గం ఆవిర్భావం, రెడ్డి రాజుల పాలనపై 350 పేజీల పుస్తకం రాసినట్లు ఆయన వెల్లడించారు.

## అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం: చంద్రబాబు

అమరావతి: అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం.. ఓటు వేయని వారినీ మార్చుకుందాం అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 2వ రోజు సుస్థిర అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని సూచించారు. 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, నీటి లభ్యత సమస్య కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

# పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

అమరావతి: పార్టీ పదవుల్లో ఉన్నవారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని, పార్టీనే సుప్రీం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఏదైనా పని చెబితే దానికే మొదటి ప్రాధాన్యమివ్వాలని లోకేశ్ తెలిపారు. "క్వాంటమ్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే... అదే సమయంలో పార్టీ అప్పగించిన పని ఉండటంతో అదే నాకు ముఖ్యమని చెప్పి, ఆ కార్యక్రమానికి వెళ్లలేదు" అని ఆయన సొంత అనుభవాన్ని వెల్లడించారు. "పార్టీ ఇచ్చిన పనుల్ని తప్పనిసరిగా చేయాల్సిందే. పార్టీ పదవుల్లో ఉన్నవారు.. పార్టీ కార్యక్రమాలకు రావడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు బీఫారం ఇవ్వకపోతే... ఇక్కడున్నవారెవరూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. "పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలి" అని కోరారు.

## ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ... డిప్యూటీ సీఎం



హైదరాబాద్: స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ భావజాలం, ఆలోచన స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇది స్పీకర్‌కు కాదు సభకు జరిగిన అవమానం అని తెలిపారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించిందన్నారు. యావత్ చట్టసభనే బీఆర్ఎస్ సభ్యులు అవమానించారు. సభాపతిని అంటే సభ మట్నత్తాన్ని అన్నట్లే దళిత వర్గాల్లో పుట్టి ఎదిగి వచ్చిన వ్యక్తి స్పీకర్ గడ్డం ప్రసాద్ అని తెలిపారు. ఫ్యూడల్ విధానం మీద పోరాడిన చరిత్ర ఈ సభకు ఉందన్నారు. ఫ్యూడల్ భావజాలం నుంచి పుట్టిందే బీఆర్ఎస్ అని ప్రస్తుతం ఫాంహౌజ్ కుట్ర నడుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భట్టివిక్రమార్క బలపరిచారు. తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

# విలేకరి మల్లేసును అభినందించిన కలెక్టర్



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : జిల్లాలోని కంబదూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బాలల బీమా ప్రీమియం రూ.5 లు చొప్పున 4974 మంది విద్యార్థులకు రూ.24,870లను మంగళవారం అనంతపురం వార్త విలేకరి బి.మల్లేసు బాలల బీమా అకౌంటు (జాయింట్ కలెక్టర్ అండ్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్సమగ్ర శిక్ష అనంతపురం)లో జమ చేశారు. జమ చేసిన రసీదుని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విలేఖరి బి.మల్లేసును అభినందించారు. విలేఖరి తన సొంత ఊరు కంబదూరు మండలం వైసిపల్లి కావడంతో ఆ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అందరికీ రూ.5 చొప్పున బాలల బీమా ప్రీమియం మండలంలోని అందరు విద్యార్థులకు చెల్లించడం చాలా అభినందించాల్సిన విషయం అన్నారు. అదేవిధంగా విలేఖరి గతంలో ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు కూడా అందజేశారని గుర్తుచేశారు. ఈ ప్రీమియం ద్వారా ప్రమాదవశత్తు విద్యార్థులు మృతి చెందుతే ఆ విద్యార్థికి రూ.25 వేల రూపాయలను, గాయపడిన వారికి రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరికొందరు దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. ఆ విధంగా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ బీమాను సాధారణ మరణాలకు కూడా వర్తింపు చేయాలని, బీమా ప్రీమియంను రూ.5 నుండి రూ.10లకు పెంచి బీమాను రూ.25 వేలు నుండి రూ.50 వేలకు పెంచాలని దాత అయిన విలేకరి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇందుకు కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు. విలేకరిని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎన్.అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ అభినందించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఇన్‌ఛార్జ్ ఐఈడి కోఆర్డినేటర్ ఫణిరాజు, కంబదూరు ఎంఈఓ-1 ఉమాపతి పాల్గొన్నారు.

# యాదవులకు జడ్పీ చైర్మన్ కేటాయించాలి



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : యాదవులకు అనంతపురం జడ్పీ చైర్మన్ పదవి కేటాయించాలని యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వర్థ యాదవ్, స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ ప్రభుత్వన్ని కోరారు. యాదవ సంఘం భవనంలో జరిగిన పాత్రికేయులు విలేకరి సమావేశంలో మాట్లాడుతూ.. 2024 సాధారణ ఎన్నికల్లో యాదవులకు రాజకీయ పార్టీలన్నీ మొండిచేయి చూపాయని, కానీ యాదవులు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారన్నారు. జిల్లాలో బలమైన బీసీ సామాజిక వర్గం యాదవులు అలాంటి వారిని విస్మరిస్తే పార్టీలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. 34 శాతం రిజర్వేషన్ కల్పించిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనాభా దామాషా పద్ధతి ప్రకారం యాదవులకు జడ్పీ చైర్మన్ మేయర్ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవులకు ఏ పార్టీ రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తే ఆ పార్టీకి ఓటు వేస్తామని, యాదవులను విస్మరించిన పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దారెడ్డి యాదవ్, ప్రతాప్, బబ్లు, శశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నేత్రదాన పక్షోత్సవ సందర్భంగా ర్యాలీ



ఉరవకొండ, సెప్టెంబర్ 8 అనంత సూర్య : నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎసఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉరవకొండ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని.. 'నేత్రదానం చేయండి - మరొకరి జీవితంలో వెలుగు నింపండి', 'నేత్రదానం మహాదానం' వంటి నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉరవకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శైలజ రాణి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా చూపు కోల్పోయిన వారికి కొత్త వెలుగును అందించవచ్చని తెలిపారు. నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మరణం తర్వాత కూడా మన కళ్లతో మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ అవగాహన ర్యాలీ ప్రధాన ఉద్దేశమని , మరణించిన వ్యక్తి దాదాపు 6 నుంచి 8 గంటల లోపు కంటిలోని రెటీనాను మాత్రమే తీసి ఇద్దరి జీవితాలలో వెలుగును నింపడానికి కృషి చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ట్రెజరర్ సుంకర రమేష్, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యుడు మంజునాథ్ రెడ్డి, వైస్ ప్రిసిపాల్ సోమశేఖర్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీరర్, ఎనఎసఎస్‌యస్ పి.ఓ విష్ణుప్రియ, సుధాకర్, అధ్యాపకులు రమేష్, సుజాత, ఆంజనేయులు పాల్గొన్నారు.

# సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి



అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 8 అనంత సూర్య : తమకు పదోన్నతి కల్పించి, వృత్తిపరంగా ముందడుగు వేసే అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీ.జగదీష్, అదనపు ఎస్పీ నాగభూషణంలను పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2007, 2009 బ్యాచ్‌లకు చెందిన 54 మంది సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. పోలీసు కానిస్టేబుళ్లుగా బందోబస్తు, స్టేషన్ నిర్వహణ, కోర్టు డ్యూటీలు, శాంతిభద్రతల పరిరక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందినందున ఇకపై కేసులు నమోదుతో పాటు దర్యాప్తు చేసే అధికారాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సూరి, లక్ష్మినారాయణలు పాల్గొని పెద్ద ఎత్తున్న పదోన్నతులు కల్పించిన జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలకు జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో పాటు కృతజ్ఞతలు తెలియజేయదానికి ఏ.ఆర్ నుండీ సివిల్‌కు కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు కూడా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోండి

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 8 అనంత సూర్య : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నియమ నిబంధనలకు లోబడి జరుపుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారానే ఉచిత అనుమతులు (సింగిల్ విండో) వినాయక మంటపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్ పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖల అనుమతులను ఒకే వేదిక ద్వారా ఉచితంగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుశాఖ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. లిదరఖాస్తు విధానం :లి వెబ్‌సైట్‌లో 'న్యూ అప్లికేషన' ఎంచుకుని, మొబైల్ నంబర్, ఒటిపి నమోదు చేయాలి. లినమోదు చేయాల్సిన వివరాలు :లి దరఖాస్తుదారుడి పేరు, చిరునామా, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం మండపం ఎత్తు, ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జన సమయం, వాహనం, మార్గం వివరాలు ఎంటర్ చేసి సబ్మిట్ చేయాలి. ఎన్వోసీ జారీ అధికారులు దరఖాస్తును పరిశీలించి అనుమతించిన అనంతరం క్యూఆర్ కోడ్ కలిగిన నిరభ్యంతర పత్రం జారీ అవుతుంది. దీనిని ప్రింట్ తీసి మండపంలో ఉంచాలి. ఉత్సవ నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు ముందస్తు జాగ్రత్తలు : ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసి, దానికి పూర్తి బాధ్యత వహించాలి. ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలాల్లో మంటపాలకు సంబంధిత అధికారుల లేదా యజమానుల అనుమతి తప్పనిసరి. పందిళ్లు మంటపాల వద్ద అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా తగినంత ఇసుక, నీళ్లు మరియు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు (అగ్నిమాపక పరికరాలు) సిద్ధంగా ఉంచాలి. విద్యుత్ భద్రతా జాగ్రత్తలు: ప్రకాశవంతమైన లైట్లు, వైరింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కాకుండా అర్హులైన నిపుణుల ద్వారా సురక్షితంగా వైరింగ్ చేయించుకోవాలి. శబ్ద కాలుష్యం నిబంధనలు : అధిక శబ్దం కలిగించే స్పీకర్లు వాడకూడదు. మైకులను ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలి. ఎవరైనా కించపరిచేలా మాట్లాడటం లేదా రెచ్చగొట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే ప్రచారాలు చేయరాదు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైకుల ప్రచారం నిషిద్ధం. రాత్రి వేళల్లో నిర్వాహక కమిటీ ప్రతినిధులు విధిగా మండపాల వద్ద కాపలా ఉండాలి. భద్రతా దృష్టితో ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పందిళ్లలో విలువైన వస్తువులు ఉంచకూడదు. ఉత్సవాలు జరిగే ప్రదేశంలో కమిటీ సభ్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ ప్రతిమలను ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది. వినాయక పందిళ్లు, ప్రతిమలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు రోడ్లపై రాకపోకలకు అంతరాయంగా ఉంచకూడదు. ఉత్సవాల సమయంలో బాణసంచా కాల్చకూడదు. మంటపాల వద్ద, ఊరేగింపులో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నృత్యాలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఊరేగింపు సమయంలో పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు చేయరాదు. ఎక్కువ శబ్దం వచ్చే డీజే. వాయిద్యాలకు అనుమతి ఉండదు. నిమజ్జన ఊరేగింపుకు అనుమతించిన సమయం, కేటాయించిన ప్రదేశం, మార్గాల్లో నిబంధనలను



ఖచ్చితంగా పాటించాలి. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక పరికరాలు, వైద్య సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలను నమ్మవద్దని కోరారు. ఏదైనా సమస్య లేదా అత్యవసర పరిస్థితి ఉంటే డయల్-112 లేదా సంబంధిత పోలీసులను గాని సంప్రదించాలని సూచించారు.

# ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్, డ్యూటీ మీట్‌లో సత్తా చాటిన శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు..



పుట్టపర్తి, సెప్టెంబర్ 08, అనంత సూర్య న్యూస్: గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, విట్ యూనివర్సిటీలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ మరియు డ్యూటీ మీట్లో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 17 పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన 23 మంది పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ క్రీడాంశాల్లో పాల్గొని 3 బంగారు, 3 వెండి, 11 కాంస్య పతకాలు సాధించారు.వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, కోకో, యోగా, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం, 4ఐ400 మీటర్ల రిలే తదితర క్రీడాంశాల్లో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తమ చాంబర్‌లో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను అభినందించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు.జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.అనంతరం అడిషనల్ ఎస్పీ అంకిత సురాన తన చాంబర్లో కలిసిన క్రీడాకారులను అభినందించారు. పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు: గోరంట్ల సీఐ శేఖర్ -- కబడ్డీలో కాంస్య పతకం.ఏఆర్ ఆర్ఎస్ఐ వీరన్న -- క్రికెట్, కోకోలో , వెండి,కాంస్య పతకం. సంజీవ రాయుడు, మురళీమోహన్, సంజప్ప, రాంప్రసాద్, ఈశ్వర్, వీరానాయక్ -- కోకో పోటీలలో కాంస్య పతకాలు.గోవిందు -- ఫుట్‌బాల్‌లో కాంస్య పతకం.ప్రసాద్ -- 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం పోటీలలో బంగారు పతకాలు.పద్మశ్రీ -- పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బ్యాడ్మింటన్‌లో వెండి పతకం, 4ఐ400 మీటర్ల రిలేలో వెండి పతకం.మంజమ్మ -- యోగాలో వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శేఖర్, శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ వీరన్న, పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 8, అనంత సూర్య న్యూస్: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కాంక్లేవ్‌లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొన్నారు. సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సురేంద్రబాబు కాంక్లేవ్‌కు హాజరయ్యారు. టీడీపీ నాయకత్వం, పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించే అంశాలపై కాంక్లేవ్‌లో చర్చలు జరుగుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించిన అంశాలతో పాటు పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై కూడా నాయకులు దృష్టి సారించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది..

# ఎస్ వి జి ఎం లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం




కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 8, అనంత సూర్య న్యూస్: స్థానిక ఎస్ వి జి ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.హర్షలత, ఎన్ఎస్ఎస్అధికారి డా.కె.శ్రీధర్ పాల్గొని విద్యార్థులకు అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.హర్షలత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ విద్య అందేలా చేయడం, అక్షరాస్యత ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే అక్షరాస్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డా.కె.శ్రీధర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన యునెస్కో 1966లో జరిగిన 14వ జనరల్ కాన్ఫరెన్స్‌లో సెప్టెంబర్ 8ను అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. 1967 సంవత్సరం నుంచి ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2026 సంవత్సరానికి అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ప్రధాన థీమ్ -- "ప్రజలు, గ్రహం మరియు శ్రేయస్సు కోసం అక్ష రాస్యత" అని తెలిపారు. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా, సమర్థవంతంగా మాట్లాడటం, వినడం, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం కూడా అని వివరించారు. అక్షరాస్యత ప్రతి ఒక్కరి ప్రాథమిక మానవ హక్కు అని పేర్కొన్నారు. అక్షరాస్యత ద్వారా పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని, ప్రపంచవ్యాప్తంగా నిరక్షరాస్యతను తగ్గించి అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో యునెస్కో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిలుపునిస్తూ, తమ గ్రామాల్లో ఉన్న వయోజన నిరక్షరాస్యులకు కనీసం తమ పేరు రాయడం నేర్పించేందుకు ప్రతి విద్యార్థి తన వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.అరుణశ్రీ, తిమ్మరాజు, వెంకటేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రీసర్వే అనంతరం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

నంబులపూలకుంట, సెప్టెంబర్ 8, అనంత సూర్య న్యూస్: నంబులపులకుంట మండలం పెడబల్లి గ్రామంలో రీసర్వే అనంతరం సిద్ధమైన



భూ రికార్డుల ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన గ్రామ-సభలో తహశీల్దార్ లక్ష్మమ్మ పట్టాదారులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మమ్మ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో భాగంగా భూముల క్షేత్రస్థాయి పరిశీలన, కొలతలు చేపట్టి భూ రికార్డులను నవీకరించినట్లు తెలిపారు. భూముల విస్తీర్ణం, సరిహద్దులు, హక్కులకు సంబంధించిన వివరాలను పరిశీలించిన అనంతరం సిద్ధమైన రీసర్వే రికార్డుల ఆధారంగా అర్హులైన పట్టాదారులకు పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో మరింత స్పష్టత, పారదర్శకత ఏర్పడుతుందని తెలిపారు. పాస్ పుస్తకాలను అందుకున్న పట్టాదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మమ్మ, డిప్యూటీ తహశీల్దార్ దేవేంద్ర నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పట్టాదారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాల నందు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు




అనంత సూర్య సెప్టెంబర్ 8.శెట్టూరు కేజీబీవీ పాఠశాల నందు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ను పురస్కరించుకొని శెట్టూరు కేజీబీవీ స్కూల్ నందు విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించడం ఐనది. ఈ పోటిల్లో గెలుపొందిన విద్యార్థినులకు మండల ఎంపీడీఓ టి. జీలాని బాషా వారు బహుమతులు ఇవ్వడమైనది. అనంతరం పాఠశాల నందు నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఎంపీడీఓ వారు తనిఖీ చేయడమైనది. మధ్యాహ్న భోజన పథకం చాలా బాగుగా నిర్వహించబడుచున్నదని సంతృప్తి వ్యక్తం చేయడమైనది.ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి శ్రీధర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ లలితమ్మ కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల ఎంపీడీఓ టి. జిలాని భాష, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన మహిళను బంధువులకు అప్పగింత

### – 24 గంటల్లోనే గుర్తించిన త్రీ టౌన్ పోలీసులు



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : మతిస్థిమితం సరిగాలేని తప్పిపోయిన మహిళను 24 గంటల్లోనే గుర్తించి బంధువులకు అనంతపురం 3 టౌన్ పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కొత్తపల్లి గ్రామం, రాయచోటి, అన్నమయ్య జిల్లాకు చెందిన జి.శ్రీదేవి, (40) అను ఈమె పుట్టుకుతోనే చెవుడు, మూగ, మతిస్థిమితం కూడా సరిగాలేదు. ఈమె సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో అనంతపురం టౌన్‌లోని బస్ స్టాండ్ నందు ఆమె అక్కతో పాటు కదిరి బస్ ఎక్కి, జనం ఎక్కువగా ఉన్నందున బస్ నుండి కిందకి దిగిందని, ఆమె అక్క బస్ లోని లగేజీ తీసుకునే సమ-యంలో ఎక్కడికో వెళ్లిపోయిందని, అప్పటి నుండి ఆమె కనిపించడం లేదని రాబడిన ఫిర్యాదుపై అనంతపురం 3 టౌన్ సీఐ కౌలుట్లయ్య వెంటనే స్పందించి, మహిళ ఆచూకీ కోసం పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి, కేవలం 24 గంటల వ్యవధిలోనే తప్పిపోయిన మహిళయొక్క ఆచూకీ కనుగొని, ఆమె కుటుంబ సభ్యులకు సురక్షితంగా వారికి అప్పగించారు. ఈ సందర్భంగా తమ కుటుంబ సభ్యురాలిని సురక్షితంగా తిరిగి అప్పగించిన అనంతపురం 3 టౌన్ సీఐకి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రతే ధ్యేయంగా, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కోసం నిరంతరం కృషి చేస్తున్న 3టౌన్ పోలీసుల సేవాభావానికి మరో ఉదాహరణగా ఈ ఘటన నిలిచింది.

## జగన్ ను కలిసిన ఎంపీటీసీ రమేష్

### – మండలంలో పలు సమస్యలు జగన్ దృష్టికి

అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,



మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిని కుడేరు మండలం ఇప్పేరు ఎంపీటీసీ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దొడ్డికల్లు రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎంపీటీసీ రమేష్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్ల మ-రమ్మతులు, ఇతర ప్రాథమిక వసతుల సమస్యలను వివరించారు. అలాగే నియోజకవర్గం/మండల పరిధిలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, సాగునీరు, పంట సాయం అంశాలను ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన జగన్, స్థానిక నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రత్యేకంగా కలిశారు. పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టుల కాలువల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం మంజూరు, కాలువలు, లిఫ్ట్ లు ఏర్పాటు కోసం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమం తర్వాత వారు ముఖ్యమంత్రితో భేటి అయ్యారు. 2018లో జి.ఒ.నెంబర్ 59 ద్వారా, 803 కోట్ల 96 లక్షల 67 వేల రూపాయల నిధులతో అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ కు నీరు అందించే పనులు మంజూరు చేశారని ఈ సందర్భంగా సునీత వివరించారు. 4 లిఫ్ట్ లతో పాటు 54 కిలోమీటర్లు కాలువ నిర్మాణం మరియు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించాలని కోరగా, పరిటాల రవీంద్ర సాగునీటి పథకం పేరుతో పనులు ప్రారంభించామన్నారు. 3నియోజకవర్గాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల భూమి అవసరం కాగా మనపై నమ్మకంతో రైతులు ఎలాంటి పరిహారం పొందక మునుపే సుమారు వెయ్యి ఎకరాల భూములు ఇచ్చారన్నారు. 2018-19 సం.లో కేవలం 95 ఎకరాలకు 5.20 కోట్ల రూపాయలు మాత్రమే రైతుల ఖాతాలోకి జమ చేయడం జరిగింది. మిగిలిన 915 ఎకరాలకు ఆనాటి ధరల ప్రకారం 50.75 కోట్లు ఇంకా చెల్లించవలసి ఉందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఆ రైతులకు ఎలాంటి పరిహారం అందకపోగా పంటలను కూడా కోల్పోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న ఇతర ప్రాజెక్ట్ లకు 2025సం, మార్చి 30వ తేదిన సుమారుగా 45 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ కు 55 కోట్లకు గాను కేవలం 2 కోట్ల రూపాయల మాత్రమే చెల్లించామన్నారు. దాదాపుగా 53 కోట్ల రూపాయలకు సంబంధించిన నష్ట పరిహారం అందక రైతులు అసంతృప్తితో ఉన్నారని వివరించారు. రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు ప్రాజెక్ట్ పనులు కూడా త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భైరవాని తిప్ప కింద పెండింగ్ లో ఉన్న పనులు, రైతులకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. దీని పై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రైతులకు పరిహారం ఇచ్చేలా ఆదేశాలిసా-_మన్నారు. రెండు ప్రాజెక్టులను మనం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యేలు సునీత, సురేంద్రబాబు తెలిపారు.

## డీఎస్సీ అవకతవకలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలి



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయని, డీఎస్సీ అవకతవకలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తరిమెల గిరి, ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒకవైపు ఎలాంటి అవకతవకలు జరగలేదని చెబుతూనే, మరోవైపు కొంతమందిని అరెస్టు చేయడం, పలు ఘటనలపై విచారణకు ఆదేశించడం అనుమానాలకు అవకతవకలు జరిగాయనేది వాస్తవమన్నది స్పష్టమౌతుందన్నారు. అదేవిధంగా ఎంపిక కాబడిన అభ్యర్థుల సక్సెస్ స్టోరీలను నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రులు వారి సోషల్ మీడియాలో హ్యాండిల్స్‌లో ప్రచారం చేయడమంటే రాష్ట్ర యువతను రెండుగా చీల్చి ఈ అవకతవకలను కాలగర్భంలో క ల వ డ ఎ ం న ని భావిస్తున్నామన్నారు. కావున ఎంపికైన అభ్యర్థులది సమస్య కాదు, అన్యాయానికి గురికాబడిన అభ్యర్థులదన్నారు. ప్రభుత్వం నిజానిజాలు తేల్చి ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పారదర్శకత లోపించడం వల్ల ఏళ్ల తరబడి కష్టపడి చదువుతూ, లక్షల రూపాయలు ఖర్చు చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఒక్క అభ్యర్థికి జరిగిన అన్యాయం కూడా వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. కావున ప్రభుత్వం డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపై కేసులు, అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలి కాకినాడలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారిపై కేసులు పెట్టడం, అరెస్టులకు పాల్పడటం దుర్మార్గం అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై పోలీసు కేసులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అభ్యర్థులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అభ్యర్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగుల గొంతుకను అణిచివేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు.

## అనంతలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 8 అనంత సూర్య : విద్యాసంస్థల పరిసరాల్లో అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులు ఈగల్ సెల్ అధికారులు ఈరోజు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన' పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం నగరంలోని ఝాన్సీ లక్ష్మీ భాయ్ హైస్కూల్, చైతన్య టెక్నో స్కూల్, నారాయణ స్కూల్, గుడ్ చిల్డ్రన్స్ హైస్కూల్, తదితర విద్యాసంస్థల చుట్టూ 500 మీటర్ల పరిధిలోని 6 కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న 5 దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. విద్యాసంస్థల పరిసరాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జిల్లా 'ఈగల్



సెల' ఎస్సై హనుమంతు ఆధ్వర్యంలో బృందం పాల్గొన్నారు.

## రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా శివప్రసాద్ ఎంపిక



అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త-ర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రభుత్వానికి, అలాగే తనకు పూర్తి సహకారం అందించిన అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పరిషత్ సభ్యుడిగా నియమితులైన కార్యదర్శి శివప్రసాద్‌తోపాటు ఆయన నియామకానికి సహకరించిన చైర్మన్ వడ్డే వెంకట్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు, సిబ్బంది ఘనంగా అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో నాయకులు ప్రతాప్ రెడ్డి, కమ్మన్న, జయరాం, శ్రీనివాసులు, రవికుమార్ నాయుడు, రామాంజినే-యులు, రాజు, శ్రీపతి, గోవిందు, బొజ్జ నాయక్, కాజా, క్రిస్ట, రామాంజినమ్మ, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

# ప్రజాసేవే లక్ష్యం...

## అభివృద్ధే అజెండాగా సాగిన లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమం





అనంతపురం, సెప్టెంబర్ 8 అనంత సూర్య : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సహచర ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసేవ, సుపరిపాలన, పార్టీ--ప్రభుత్వ సమన్వయం, రాజకీయ కమ్యూనికేషన్ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని నియోజకవర్గ స్థాయి అభివృద్ధితో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. నీటి వనరుల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించడంతో పాటు, రాజకీయ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడం, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపైనా కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అందించిన దిశానిర్దేశం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మరింత చురుగ్గా పనిచేస్తామని పేర్కొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405